
సాక్షి సంగారెడ్డి

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



సిద్దిపేట జిల్లా చింతమడకలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలతో కలిసి బతుకమ్మ పేరుస్తున్న ఎమ్మెల్సీ కవిత



నెత్తురోడుతున్న రహదారులు

జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలు పెరుగుతున్నాయి.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

బోరంచలో నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు



ఆలయంలో కొలువైన అమ్మవారు

నారాయణఖేడ్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు మనూరు మండలంలోని సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ దేవస్థానంలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 2వ వరకు ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ప్రధానార్చకులు సిద్దుస్వామి, నగేశ్‌స్వామి ఆదివారం వెల్లడించారు. అమ్మవారు భక్తులకు రోజుకోరూపంలో దర్శనమిస్తారని చెప్పారు. సోమవారం పాఢ్యమి నాడు అమ్మవారు బాలా త్రిపురాసుందరీట వీగా దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. అమ్మవారిని నిత్యం కుంకుమార్చన, ప్రత్యేక అభిషేకం, మహానైవేద్యం, నిత్య అన్నదానం కార్యక్రమాలు జరగనున్నాయి. మహోత్సవాలు, ఒక్కోరోజు అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, అన్నదానంకు భక్తులు 81799 76606, 99499 71150, 80960 46076, 99480 56415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇబ్బందుల్లేకుండా నీటి సరఫరా చేయండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: గ్రామాలు, తండాలకు తాగు నీటి ఇబ్బందులు ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. నాగల్‌గిద్ద మండలం గుడూరు గ్రామంలో మంజీరా నదిపై ఉన్న 4 ఎంఎల్‌డీ నీటిశుద్ధి ప్లాంట్‌ను, పంప్‌హౌజ్‌ను ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. పంప్‌హౌజ్‌లో మోటార్ల పనితీరును పరిశీలించి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని సూచించారు. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల మిషన్ భగీరథ పైపులు, పంపు మోటారు చెడిపోయి నీటి సరఫరాకు అంతరాయమేర్పడిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటికి మరమ్మతులు చేపట్టామని, ఇక ముందు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. సమస్యలు ఉన్న పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

బాగా చదివి పేదలకు వైద్యసేవలందించాలి

విద్యార్థి దినేశ్ నాయక్‌కు సన్మానంలో హరీశ్‌రావు



రాథోడ్ దినేశ్‌ను సన్మానించి అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నారాయణఖేడ్: విజయవంతంగా వైద్య విద్యను పూర్తి చేసి పేదలకు సేవలందించాలని ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన రాథోడ్ దినేశ్ నాయక్‌కు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. ఖేడ్ మండలం పలుగు తండాకు చెందిన రాథోడ్ దినేశ్ నాయక్ సిద్దిపేట మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును సాధించాడు. తండ్రి రాథోడ్ పండిత్‌నాయక్ ఆటో నడుపుతుండగా తల్లి ధూరిబాయి వ్యవసాయ కూలిపనులు చేస్తుంది. ఆదివారం దినేశ్ నాయక్ ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, ర్యాకల్, పలుగు తండాలకు చెందిన నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నెహ్రూనాయక్, నితిన్ నాయక్‌లతో కలిసి హైదరాబాద్‌లోని మాజీమంత్రి హరీశ్‌రావు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా దినేష్ నాయక్‌ను హరీశ్‌రావు సన్మానించారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

కేతకీలో అమావాస్య పూజలు

తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వరాలయంలో భక్తులు అమావాస్య పూజలు నిర్వహించారు. ఆదివారానికి తోడు అమావాస్య కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రాతఃకాలం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. వేకువ జాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని స్వామివారిని క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, ఆశీర్వదించారు.

స్వామి వారికి ప్రత్యేక పూజలు

భక్తులు స్వామి వారికి అభిషేకం, అర్చన, హారతితోపాటు వాహన పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా పంచభక్ష పరమాన్నాలు మహా నైవేద్యంగా సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



పూజలు అందుకుంటున్న పార్వతీ పరమేశ్వరులు

పైసల్లేవు.. పండుగెట్లా!

- ఆర్థిక ఇబ్బందుల్లో కార్యదర్శులు
- 18 నెలలుగా విడుదల కాని నిధులు
- అకౌంట్ ఫ్రీజింగ్‌తో క్లియర్ కానీ చెక్కులు
- గ్రామాల్లో బతుకమ్మ, దసరాపై ప్రభావం

ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు పండుగ కూడా జరుపుకోలేని దుస్థితి ఏర్పడింది. ఏడాదిన్నరగా గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా వంటి పనులకు ఇంతవరకు నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

రాయికోడ్(అందోల్): సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలుండగా 633 మంది పంచాయతీ కార్యదర్శులున్నారు. గ్రామాల్లో వివిధ పనుల కోసం కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బిల్లుల కోసం చెక్కులు పంపితే ట్రెజరీలో అకౌంట్ ఫ్రీజింగ్ ఉందని, అప్పులు చేసి నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో 2 పెద్ద పంచాయతీల్లో 6 లక్షల వరకు తమ జేబుల్లోంచి ఖర్చు చేసినట్లు పేర్కొంటున్నారు. బిల్లులు అందించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. జీపీలకు నేరుగా వచ్చే ఆదాయాన్ని రోజు వారీ ఖర్చులకు వినియోగించేకు



డీపీఓకు వినతి పత్రం ఇస్తున్న టీపీఎస్‌ఏ నేతలు

నేలా అనుమతులిస్తే ఇంతలా ఇబ్బందులు ఉండవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పండుగలపై ప్రభావం

బిల్లులు పెండింగ్‌లో ఉండటం, కార్యదర్శులు అప్పుల్లో కూరుకుపోవడంతో బతుకమ్మ, దసరా పండుగల కోసం చేసే ఏర్పాట్లపై ప్రభావం పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రెజరీలో ఫ్రీజింగ్ ఎత్తివేసి, ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు 3 నెలలుగా వేతనాలు రాలేదు. దీంతో వారితో పని చేయించడానికి కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో పని చేస్తున్న 28 మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులకూ 7 నెలలుగా వేతనాలు అందక ఎదుర్కొంటున్న ఇబ్బందులు పడుతున్నారు. మొత్తంగా ప్రత్యేక పాలనలో అటు ప్రజలు, ఇటు కార్యదర్శులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు.

18 నెలలుగా బిల్లులు లేవు



18 నెలలుగా బిల్లులు రాక ఒక్కో కార్యదర్శి రూ.లక్ష నుంచి రూ.6 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేశారు. బిల్లులు రాక చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురవుతున్నారు. జీపీ నిధులు విడుదల రాకుండా ట్రెజరీలో ఫ్రీజింగ్ పెట్టారు. గ్రామాల్లో కనీస అవసరాల కోసం డబ్బు లేకపోవడంతో అత్యవసర పనులు మాత్రమే చేయిస్తున్నారు. జీపీలకు నేరుగా వచ్చే ఆదాయం జమ, ఖర్చుల కోసం ప్రతీ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అకౌంట్‌ను ఏర్పాటు చేయిస్తే ఊరట లభిస్తుంది.

- రమేశ్, టీపీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు

సొంతంగా రూ.3 లక్షలు ఖర్చు చేశాను



నిధులు విడుదల కాకపోవడంతో నిత్యం తప్పని సరిగా చేయాల్సిన పనుల కోసం రూ.3 లక్షలు సొంతంగా ఖర్చు చేశాను. దసరా కోసం అప్పు చేసి వీధి బల్బులు వేయించాల్సి వస్తోంది. నిధులు లేక ఆశించిన స్థాయిలో గ్రామాల్లో పనులు చేయలేకపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు అందేలా చూడాలి.

-శివశంకర్, పంచాయతీ కార్యదర్శి రాయికోడ్

అసంపూర్తిగా గోపాల మిత్ర భవనాలు

ఇబ్బందులు పడుతున్న పశు పోషణదారులు, రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం పక్కా భవనాలు మంజూరు చేస్తున్నా వాటిని సకాలంలో పూర్తి చేయకపోవడంతో అటు అధికారులు, ఇటు పశు పోషణదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం భవనాల మంజూరులో చూపుతున్న శ్రద్ధ తదనంతరం చూపకపోవడంతో ఏళ్ల తరబడి భవనాలు పూర్తి కావడం లేదనే పలువురు విమర్శిస్తున్నారు. అందుకు మండలానికి మంజూరైన గోపాల మిత్ర భవనాలను నిదర్శనంగా చెప్పవచ్చు. గ్రామాల్లో పశువుల కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పించి వాటి అందుకు మందులను వేసేందుకు



ముంగి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గోపాల మిత్ర భవనం

2001లో ప్రభుత్వం గోపాల మిత్ర పథకాన్ని ప్రవేశ పెట్టింది. అందులో భాగంగా ప్రారంభంలో ఇద్దరు, ముగ్గురు గోపాల మిత్రలను నియమించింది. గర్భోత్పత్తికి సంబంధించిన ద్రావణాన్ని భద్ర పర్చుకునేందుకు వారికి కంటియినర్ (3 లీటర్ల సామర్థ్యం) ఇచ్చింది. అయితే మందులను భద్ర పరిచేందుకు, పశువులకు చికిత్సలు నిర్వహించేందుకు భవనాలు లేకపోవడంతో గోపాల మిత్రలు, పశు పోషణదారులు ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం 2013లో మండలానికి రెండు గోపాల మిత్ర భవనాలను మంజూరు చేసింది. రూ.15.20లక్షలతో టేకూర్, ముంగి గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున భవనాలు మంజూరు చేసింది. ఆ తర్వాత చాలాకాలానికి టెండర్లు వేశారు. పదేళ్లకు భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. రెండు గ్రామాల్లో చేపట్టిన భవన నిర్మాణం పనులు చిన్న చిన్న పనులు మినహా ఏడేళ్ల క్రితం పూర్తయ్యాయి. భవన నిర్మాణం పనులు పూర్తయినప్పటికీ ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

కరెంట్ లేక నిరుపయోగంగా మారిన భవనం

టేకూర్‌లో నిర్మించిన భవనంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అది నిరూపయోగంగా మారింది. ముంగిలో నిధుల కొరత కారణంగా భవనం నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. భవనం నిర్మించినప్పటికీ నిధులు సరిపోకపోవడంతో తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదు. వర్షానికి దెబ్బతినకుండా ఉండేందుకు కిటికీలకు రేకులు, కట్టెలను ఏర్పాటు చేశారు. బాత్ నిర్మాణం పనులు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గోపాల మిత్ర భవనాల నిర్మాణం పనులు పూర్తి చేయించాలని మండలంలోని ఆయా గ్రామాల గోపాల మిత్రలు, పశు పోషణదారులు కోరుతున్నారు.



కిటికీలకు కట్టెలు, రేకులు ఏర్పాటు చేసిన ముంగిలోని భవనం

వినియోగంలోకి తేవాలి

గ్రామంలో నిర్మించిన గోపాల మిత్ర భవనం పనులు దాదాపు పూర్తయినప్పటికీ దానికి కిటికీలు, తలుపులు బిగించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. భవనం పనులు అసంపూర్తిగా ఉండటంతో సామగ్రిని అందులో పెట్టుకోవడం లేదు. మిగిలిపోయిన చిన్న చిన్న పనులను వెంటనే పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

-జనార్దన్‌రెడ్డి,గోపాల మిత్ర-ముంగి

చర్యలు తీసుకుంటాం

మండలంలో గోపాల మిత్ర భవనాలు అసంపూర్తిగా ఉన్నట్లు నాకు తెలియదు. మండల ఏఈగా ఇటీవలే వచ్చాను. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

-మహేశ్, పంచాయతీ రాజ్ ఏఈ-న్యాల్‌కల్

త్వరలో ట్రిపుల్‌ఆర్ పరిహారం!

కసరత్తు చేస్తున్న రెవెన్యూ అధికారులు

తూప్రాన్: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)గా వాడుకలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూసేకరణ పనులు చివరి దశకు చేరాయి. రైతులకు పరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూసేకరణలో అన్ని ప్రక్రియలు ముగిసి, నష్ట పరిహారం నిర్ణయించే అవార్డు దశలో ఉన్నట్లు తెలుస్తోంది. రైతులకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్లు, ఇతర వివరాలను రెవెన్యూ సిబ్బంది సేకరించి నేషనల్ హైవే అథారిటీ వెబ్‌సైట్ భూమి రాశి పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నమోదు ప్రక్రియ సాంకేతికంగా సంక్లిష్టంగా ఉండడంతో ఆలస్యం అవుతున్నట్లు సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. భూసేకరణ నోటిఫికేషన్ వచ్చిన 2022 నాటి సబ్ రిజిస్ట్రార్ ప్రాథమిక విలువల ఆధారంగానే నష్టపరిహారం చెల్లించే పరిమితి ఉన్నట్లుగా తెలిసింది. అంతకుమించి ఎక్కువ రేటుకు ఆర్డీఓ నిర్ణయించడం చట్ట ప్రకారం చెల్లదని, కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే రైతులకు వీలైనంత మంచి ధరను పరిహారంగా చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చొరవ తీసుకున్నారు. నేషనల్ హైవే చట్టంలోని ఆర్బిట్రేషన్ అనే ప్రక్రియను ఉపయోగించి రైతులకు న్యాయం చేయవచ్చు అని, ఆ బాధ్యతను కలెక్టర్‌కు అప్పగించినట్లు తెలిసింది. దానికి అనుగుణంగా రెవెన్యూ సిబ్బంది ముమ్మరంగా పనుల్లో నిమగ్నమవుతున్నారు. రైతులకు ఈ ప్రక్రియ మీదున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో కూర్చొని నోటీసులు ఇవ్వకుండా, రైతుల ఇంటి వద్దకే వెళ్లి నోటీసులు ఇస్తూ, వారికి భరోసాను కల్పిస్తున్నారు. మొత్తం మీద నెల రోజుల్లో వారికి ఆర్డీఓ, కలెక్టర్ నిర్ణయించే ధర ప్రకారం రైతుల అకౌంట్లో డబ్బులు పడే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.



రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి, సిబ్బంది

నేటి నుంచి శరన్నవ రాత్రి ఉత్సవాలు

వేడుకలకు సిద్ధమైన మహంకాళి, రామలింగేశ్వర దేవస్థానాలు



వేడుకలకు సిద్ధమైన మహంకాళి దేవాలయం

పటాన్‌చెరు టౌన్: మహంకాళి దేవాలయం, శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం నుంచి నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మహంకాళి అమ్మ వారి శరన్నవరాత్రి ఉత్సవాలను, రామలింగేశ్వర దేవస్థానంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అక్టోబర్ 2 వరకు రోజుకొక అలంకరణలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజున అమ్మవారు 22న శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా, 23 న శ్రీగాయత్రీదేవిగా, 24న శ్రీ అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయనిదేవిగా, 26 న శ్రీమహాలక్ష్మి దేవిగా, 27న శ్రీ లలిత త్రిపుర సుందరీదేవిగా, 28 న మహాచండీ దేవిగా, 29 న సరస్వతిదేవిగా, 30 న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా, అక్టోబర్ 2న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా పూజలతో పాటు హోమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



జీతాలిస్తేనే నీళ్లు వదిలేది



రాఘవాపూర్ ఫిల్టర్ బెడ్ వద్ద ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

పండుగ వేళ పానీ పాట్లు

- జీతాల కోసం ఆందోళన చేపట్టిన మిషన్‌భగీరథ కార్మికులు
- 73 గ్రామాలకు నిలిచిపోయిన నీటి సరఫరా

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండలంతో పాటు సమీపాన గల ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల్లో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే మిషన్ భగీరథ కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోవడంతో వారంతా విధులను బహిష్కరించారు. జీతాలిస్తేనే నీళ్ల వదిలేదంటూ తెగేసి చెప్తున్నారు. దీంతో ఈ నెల 20 నుంచి ఆ పథకం ద్వారా 73 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది నెలలుగా జీతాల్లేవు

న్యాల్‌కల్ మండల పరిధిలోని 39 గ్రామాలతో పాటు తండాలు, ఝరాసంగం మండలంలోని సుమారు 34గ్రామాలతో పాటు తండాలకు నీటి సరఫరాను అందించేందుకు రాఘవాపూర్ వద్ద ఫిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం ఇక్కడి నుంచి ఆయా గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. అందులో తాత్కాలిక పద్ధతిన 23 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి ఎనిమిది నెలలుగా జీతాలు రావడం లేదు. వచ్చే కొద్ది జీతాలు కూడా కాంట్రాక్టర్ సమయానికి ఇవ్వకపోవడం వల్ల వారు ఆందోళన బాట పట్టారు. జీతాలు సమయానికి చెల్లించకపోవడం వల్ల తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు చెల్లించే వరకు నీటి సరఫరాను చేయమని చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో బోరు బావుల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నా ఆ నీరు సరిపోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలే దసరా.. ఆపై నీళ్లు లేవు

దసరా పండుగకు నీటి అవసరం ఎంతో ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నియమ నిష్టలతో నిర్వహిస్తారు. ఇళ్లను శుభ్రం చేసే దగ్గర నుంచి ఇంట్లో ఉన్న అన్ని దుస్తులను కూడా శుభ్ర పరుస్తారు. వీటన్నింటికి నీరు ఎంతో అవసరం ఉంటుంది. ఇలాంటి సమయంలో నీటి సరఫరా నిలిచి పోవడం వల్ల తాము నానా ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



8 నెలల జీతాలు రావలసి ఉన్నా ఇప్పటి వరకు చెల్లించలేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఇతరుల దగ్గర చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యాధులు సోకి దవాఖానాకు వెళ్దామన్నా డబ్బులు లేవు. జీతాలు చెల్లించే వరకు నీటి సరఫరాను చేయం. అధికారులు చర్యలు తీసుకుని జీతాలను వెంటనే చెల్లించాలి.

-కృష్ణ,మిషన్ భగీరథ కార్మికుడు

సమస్య పరిష్కరించేందుకు చర్యలు

గ్రామాల్లో నిలిచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీటి సరఫరాకు సంబంధించిన బిల్లులు రాకపోవడం వల్ల తాత్కాలిక సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చలు జరుపుతున్నాం.

-అనిల్ కుమార్, ఏఈ జహీరాబాద్

విద్యుద్దీప కాంతుల్లో కేతకీ ఆలయం

విజయదశమి పండుగను పురస్కరించుకుని శ్రీ కేతకీ సంగమేశ్వరాలయంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని కేతకీ ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించటంతో వెలుగులీనుతోంది.

- ఝరాసంగం(జహీరాబాద్)



నెత్తురోడుతున్న రహదారులు

అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణం • జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



చేర్యాల రహదారిపై లారీని ఢీకొట్టిన కారు (ఫైల్)

జాతీయ రహదారిపై ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రమాదాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. రోడ్డెక్కితే గమ్యం చేరేంతవరకు భరోసా లేకుండా పోతుంది. ప్రధాన రహదారుల్లో అర్ధరాత్రి జరిగిన ప్రమాదాలే ఎక్కువ అని అధికారుల విచారణలో తెలుస్తున్నది. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, రహదారులపై లెక్కకు మించి యూటర్న్‌లు, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాల సంఖ్య ఏటా పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదని చెబుతున్నారు.

– సంగారెడ్డి క్రైమ్:



లారీ చక్రాల కింద పడ్డి నుజ్జునుజ్జయిన వృద్ధురాలు (ఫైల్)

వెయ్యికి పైగా ప్రమాదాలు

జిల్లాలో 2025 నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో 239కి పైగా మృతి చెందగా, 400 మందికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై 20 నుంచి 30 బ్లాక్ స్పాట్లను పోలీస్ యంత్రాంగం గుర్తించింది. కానీ అక్కడ ప్రమాదాలు నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంతాల్లోనే ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. కొన్ని ప్రమాదాల్లో గాయాలపాలైన వారు శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారు.

వాహనదారుల నిర్లక్ష్యపు డ్రైవింగ్..

భారీ వాహన డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఓవర్‌లోడ్‌తోపాటు అతివేగం ప్రమాదాలకు కారణమని అంటున్నారు. భారీ వాహన డ్రైవర్ల తీరుతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. రాత్రంతా వాహనం నడిపి నిద్ర లేకుండా డ్రైవింగ్ చేయడంతోనే డ్రైవర్లు నిద్రలోకి జారుకుంటున్నారని, దీంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసుశాఖ నివేదికలో వివరిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

ప్రమాదాల నియంత్రణకు రోడ్ సేఫ్టీ విభాగాన్ని ట్రాఫిక్ యంత్రాంగానికి అప్పగించారు. జిల్లాల్లో ఇప్పటికే బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రహదారులపై సూచిక బోర్డులు లేకపోవడం, బ్లాక్ స్పాట్ వాహనదారులకు కనిపించకపోవడం, అతివేగంతో చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

మారని తీరు..

జిల్లాలో ట్రాఫిక్ పోలీసులు నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో రోజు ఏదో ఒకచోట మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కుతూనే ఉన్నారు. కోర్టులు కూడా భారీగా జరిమాన విధించడంతో పాటు జైలు శిక్ష వేస్తున్నా కూడా వాహనదారులు మాత్రం తీరు మార్చుకోవడం లేదని చెబుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

- సెప్టెంబర్ 18న ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వృద్ధురాలు నుజ్జునుజ్జై మృతి చెందింది.
- జులై 3న కంది మండలం చేర్యాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టి సంగారెడ్డి పట్టణానికి చెందిన ఎస్సై రాజేశ్వర్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 19న సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న స్కూల్స్ బస్సును సిమెంట్ లారీ ఢీకొట్టింది.



ప్రత్యేక దృష్టి సారిస్తాం

జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం. రహదారి పక్కన వాహనాలు నిలిపినప్పుడు పార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి. నిద్రమత్తులో డ్రైవింగ్ చేయకూడదు. కచ్చితంగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి.

– సత్తయ్య, డీఎస్పీ

ఎదురెదురుగా బైకులు ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తంగడపల్లి గ్రామానికి చెందిన బేగరి రాజు(30) తన బైకుపై సదాశివపేటకు భార్యను తీసుకురావడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మద్దికుంట తండా సమీపంలోకి రాగానే సదాశివపేట నుంచి తంగడపల్లి వైపు బైకుపై వెళ్తున్న వ్యక్తి ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

సర్వీసు రోడ్డుపై పార్కింగ్ ?



సర్వీసు రోడ్డుపై పిరామల్ పరిశ్రమ ఎదుట పార్క్ చేసిన వాహనాలు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పిరామల్ పరిశ్రమకు వచ్చే వాహనాలు గ్రామంలోని సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్డును రహదారి నిబంధనలకు విరుద్ధంగా పూర్తిగా పరిశ్రమకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. దీంతో దిగ్వాల్, చిల్కేపల్లి, ఈదులపల్లి గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు స్తంభిస్తుండటంతో రాంగ్ రూట్‌లో దిగ్వాల్ గ్రామానికి చేరుకుని, అక్కడి నుంచి జాతీయ రహదారిపైకి వెళుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీలో చోరీ



లోనికి చొరబడిన దుండగుడి సీసీ చిత్రం

నర్సాపూర్ రూరల్: పీహెచ్‌సీలో దొంగలు పడి బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... రెడ్డిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రాత్రి వెనుకవైపు ఉన్న డోర్‌ను ధ్వంసం చేసి దండగుడు లోనికి వచాడు. ఇన్వర్టర్‌కు సంబంధించిన మూడు బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. బ్యాటరీల విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుంది. దుండగుడు లోనికి చొరబడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇన్‌చార్జ్ డాక్టర్ రఘువరన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి



పోలీసుల దాడిలో పట్టుబడిన జూదరులు

నారాయణఖేడ్: రెండు గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని తుర్కపల్లి శ్మశానవాటికలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పట్టుబడగా, కొందరు పారిపోయారు. వారి వద్ద ఉన్న రూ.9,470 నగదును సీజ్ చేశారు. గంగాపూర్ శివారులోని మల్లారెడ్డి వ్యవసాయక్షేత్రంలో దాడిచేసి ఐదుగురిని పట్టుకుని, రూ.3,960 నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది హరి, యాదుల్, సంకీర్తన్‌రెడ్డి, రాహుల్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

దౌల్తాబాద్(దుబ్బాక): జూదం ఆడుతున్న (చిత్తు బొత్తు) ఆటగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్ కుమార్ వివరాల ప్రకారం... గోవిందాపూర్ గ్రామంలో ఆరు నెలలుగా జూదం ఆడుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థావరంపై దాడి చేశారు. ఆరుగురు నిందితులను పట్టుకుని, రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద నుంచి రూ.2935ల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో జూదం ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మద్దూరు(హుస్నాబాద్): వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(75) కొంతకాలంగా ఆస్తమా, మధుమేహం తదితర వ్యాధులతో బాధపడుతుంది. వీటి నుంచి ఉపశమనం కోసం ప్రతి రోజు మాత్రలు వేసుకునేది. అలాగే ఈనెల 16న పరిమితికి మించి ఎక్కువ మాత్రలు వేసుకోవడంతో స్పృహ కోల్పోయింది. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మిని కుటుంబ సభ్యులు జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు... వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సుశాంత్ పరమానిక్(41)తన స్నేహితుడు భువాలి కార్వర్‌తో కలిసి వంటిమామిడి వద్ద చికెన్ తీసుకుని లక్ష్మక్కపల్లి వైపు నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ క్రమంలోనే మార్గ మధ్యలో చౌరస్తావద్దకు చేరుకోగానే శివ్వంపేట మండలానికి చెందిన డ్రైవర్ పిట్ల నర్సింలు లారీనీ అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన సుశాంత్ అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి భువాలి కార్వర్‌కు ఏమి కాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రకృతి రక్షణే.. 'బహుజన' ధ్యేయం



బహుజన బతుకమ్మ వ్యవస్థాపకురాలు విమలక్క

మల్లుపల్లిలో బతుకమ్మ ఆడుతున్న విమలక్క

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రకృతి రక్షణే.. బహుజన బతుకమ్మ ధ్యేయమని బహుజన బతుకమ్మ వ్యవస్థాపకురాలు విమలక్క పేర్కొన్నారు. ప్రకృతితో ముడిపడిన జీవితాలను ఒకే చోటికి చేర్చి ఒక సెక్యులర్ పండుగగా జరుపుకోవడమే లక్ష్యమని తెలిపారు. మండల పరిధిలోని మల్లుపల్లిలో ఆదివారం బహుజన బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మలను పేర్చారు. మహిళలతో కలిసి పాటలు పాడుతూ బహుజన బతుకమ్మ నేపథ్యాన్ని వివరించారు. అనంతరం బతుకమ్మలను గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతికి, మనిషికి ఉన్న అనుబంధాన్ని తెలియజెప్పడానికి బహుజన బతుకమ్మ కదిలి వచ్చిందన్నారు. తెలంగాణలో చాలా వరకు బహుజనులకు బతుకమ్మ పండుగలు అసలే లేవన్నారు. అలాంటి వారిని ఏకం చేయడానికే బహుజన బతుకమ్మతో ముందుకు వచ్చిందన్నారు. పోరాటాలకు పురిటి గడ్డ అయిన మల్లుపల్లికి అమర వీరుల చరిత్ర ఉందన్నారు. కాగా అమరుల కుటుంబ సభ్యులు కలిసి మల్లుపల్లి అమర వీరుల చిత్రపటాన్ని విమలక్కకు అందించారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్, అప్సర్, రమ, బహుజన బతుమ్మ నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కలకలం

- దుబ్బాకలో ఒకే నంబర్‌తో రూ. 200 నోట్లు
- భయాందోళనలో వ్యాపారులు ,ప్రజలు
- ఆరా తీస్తున్న పోలీసులు



ఒకే నంబర్‌తో ఉన్న మూడు రూ.200 నకిలీ నోట్లు, మరో సిరీస్ నోటు

దుబ్బాక: పట్టణంలో నకిలీ కరెన్సీ నోట్లు చలామణి కలకలం రేపింది. శనివారం కూరగాయల సంతలో నకిలీ 200 కరెన్సీనోట్లు భయటపడటంతో అందరూ ఉలిక్కిపడ్డారు. వివరాలు... సంతలో కూరగాయల వ్యాపారి తన వద్ద కూరగాయలు తీసుకున్న వ్యక్తికి తిరిగిచ్చిన మూడు 200 నోట్లు 8బీడీ 477982 సేమ్ నంబర్ సిరీస్ ఉండటం , మరో 200 నోటు 9ఏహెచ్ 679708 నంబర్‌తో ఉండటంతో అనుమానం వ్యక్తం చేశాడు. ఆ నోట్లను క్షుణ్ణంగా పరిశీలించగా అచ్చం నోట్లలాగా కనిపించినప్పటికీ సేమ్ నంబర్ ఉండటం, నోట్లపై గాంధీ బొమ్మ వేరేలాగా కనిపించింది. దీంతో ఈ నోట్లు నకిలీవని గుర్తించి సదరు కూరగాయల వ్యాపారిని నిలదీశారు. దీంతో ఇంతకు ముందే తన వద్ద కూరగాయలు తీసుకొని ఓ వ్యక్తి ఇచ్చాడని తెలిపాడు.

నకిలీనోట్లపై పోలీసుల ఆరా..

పట్టణంలో నకిలీ నోట్లు భయటపడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నకిలీ 200 నోట్లను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ కీర్తిరాజును సాక్షి వివరణ కోరగా... దుబ్బాక మార్కెట్‌లో నాలుగు 200 నకిలీ నోట్లు వచ్చాయని, ఇందులో 3 నోట్లు సేమ్ సీరీస్, మరో నోటు వేరే సిరీస్ ఉన్నాయని తెలిపారు. వాటిపై గాంధీజీ బొమ్మ సరిగా లేదని దీనిపై అని కోణాల్లో విచారిస్తున్నట్లు తెలిపారు.

గుట్టు చప్పుడు కాకుండా చలామణి!

సిద్దిపేట జిల్లాలోని పలు పట్టణాల్లో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ నోట్లు చలామణి అవుతున్నట్లు తెలిసింది. నకిలీ కరెన్సీ వ్యవహారం బయటపడటంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నకిలీ నోట్ల చలామణి చేసే వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరుతున్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

తూప్రాన్: వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు తాతపాపన్‌పల్లిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడు బండ్ల గణేశ్ వివరాల ప్రకారం... గ్రామ సమీపంలోని కొట్టంలో రోజు మాదిరిగా గొర్రెలను శనివారం రాత్రి తోలారు. తెల్లవారుజామున కుక్కలు దాడి చేసి 12 గొర్రెలను చంపాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న బాధితుడు

వ్యక్తి అదృశ్యం



అశోక్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన రామచంద్రాపురంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాలనీకి చెందిన అశోక్ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఈనెల 15న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి

నర్సాపూర్: మద్యం దుకాణం పర్మిట్ రూమ్‌లో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం ప్రకారం... శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన నర్సింలు(38) ఆదివారం మరో వ్యక్తితో కలిసి నర్సాపూర్‌లోని శ్రీనివాస వైన్ షాప్‌నకు చెందిన పర్మిట్ రూమ్‌కు వచ్చాడు. కాగా అతిగా మద్యం సేవించాడు. పర్మిట్ రూంలో వ్యక్తి కింద పడి ఉన్నాడని సమాచారం రాగానే సిబ్బంది అతన్ని లేపినా లేవలేదు. గుండెపోటు వచ్చి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య సంధ్య, కుమారుడు నితిన్ ఉన్నారు.

లారీ సీజ్

న్యాల్‌కల్(జహీరాబాద్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ సుజీత్ కథనం ప్రకారం... గంగ్వార్ నుంచి ఎర్ర మట్టిని అక్రమంగా లారీలో కొత్తూర్‌కు తరలిస్తున్నారు. గుర్తించిన పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న లారీని ఆదివారం పట్టుకొని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీడ్ కంపెనీకి భారీ జరిమానా

- హరితహారం చెట్లను నరికిన నేపథ్యంలో..
- అటవీశాఖ అధికారుల చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన హరితహారంలో భాగంగా నాటిన చెట్లను ఇష్టానుసారంగా తొలగించిన ప్రసాద్ సీడ్ కంపెనీ నుంచి రూ.2 లక్షల జరిమానను కట్టించినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి ఇక్రమొద్దీన్ పేర్కొన్నారు. ముద్దాపూర్ నుంచి కొడకండ్ల గ్రామానికి వెళ్లేందుకు ఉన్న బీటీ రోడ్డు వెంట ఈజీఎస్‌లో నాటిన మొక్కల పోషణ బాధ్యతలను ఫారెస్టు అధికారులు చూస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్ల కాలం నాటి చెట్లను సీడ్ కంపెనీ నిర్వాహకులు ఇష్టానుసారంగా తొలగించడంతో ఇటీవల హరితహారం చెట్ల నరికివేత అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ రాంప్రసాద్ సూచనల మేరకు గ్రామ పంచాయతీ నుంచి సీడ్ కంపెనీకి నోటీసులు జారీ చేశారు. దీంతో పాటు రూ. 2లక్షల జరిమాన విధించి వసూల్ చేసిన విషయాన్ని ఫారెస్టు రేంజ్ అధికారి ధృవీకరించారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు వెంకన్న, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

లెటర్ రాసి.. చెరువులో దూకి..

మృతదేహం కోసం గాలిస్తున్న బృందాలు



పటాన్‌చెరు టౌన్: చెరువులో గాలింపు చర్యలు చేపడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువు గట్టుపై లెటర్ రాసి, చెప్పులు, మొబైల్ ఫోన్ ఉండటంతో స్థానికులు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్ కాలనీకి చెందిన బసహరత్ ఉల్లాఖాన్ (28)గా గుర్తించారు. భార్యపై అనుమానంతో పలుసార్లు గొడవ పడి, గతంలో జైలు శిక్ష అనుభవించి విడుదలైనట్లు గుర్తించారు. శనివారం సాయంత్రం వరకు హఫీజ్‌పేట్‌లో ఇంటి వద్ద ఉన్నాడని, తర్వాత కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఉల్లాఖాన్ మృతదేహం కోసం చెరువులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు జీపీ కార్మికుడు..



పులగల్ల రాజు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులోపడి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు... గ్రామానికి చెందిన పులగల్ల నర్సమ్మ మనవడు పులగల్ల రాజు(24) చందంపేట గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం చందంపేటలో పారిశుద్ధ్య పనులు ముగించుకుని మధ్యాహ్నం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. చెరువులో స్నానం చేసే క్రమంలో జారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు యువకుడిని వెతికితీయగా అప్పటికే మృతి చెందాడు. కాగా యువకుడి తల్లిదండ్రులు ఇదివరకే మృతి చెందగా, అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు.

పకడ్బందీగా 'ఓపెన్' పరీక్షలు

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ

- ఐదు నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ
- జవాబు పత్రాలకు 24 పేజీల బుక్‌లెట్
- మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే జైలుకే



మెదక్ కలెక్టరేట్: గతంలో ఓపెన్ సొసైటీ ద్వారా నిర్వహించే టెన్త్, ఇంటర్ పరీక్షలంటే ఎలాంటి పర్యవేక్షణ లేకుండా సాధారణంగా జరిగేవి. దీంతో విద్యాశాఖ ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపడుతుంది. రెగ్యులర్ పరీక్షల మాదిరిగా కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుక్‌లెట్ రూపంలో సమాధాన పత్రాలు, 5 నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ, పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా 144 సెక్షన్ అమలు వంటి నిబంధనలు అమలు చేస్తుంది.

బుక్‌లెట్ రూపంలో సమాధాన పత్రాలు

పరీక్ష రాసే అభ్యర్థులకు గతంలో మాదిరిగా కాకుండా ఈసారి బుక్‌లెట్ రూపంలో సమాధాన పత్రాలు ఇవ్వనున్నారు. పదో తరగతి విద్యార్థులకు 20 పేజీలు, ఇంటర్‌కు 24 పేజీల బుక్‌లెట్ అందజేయనున్నారు. ఇక అదనపు సమాధాన పత్రాలు ఉండవు. వీటితోనే పరీక్ష పూర్తి చేయాలి. అలాగే ఓఎంఆర్ షీట్ కాకుండా ఎక్కడ కూడా హాల్ టికెట్ నంబర్ రాయకూడదు.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	సెంటర్లు	టెన్త్	ఇంటర్
మెదక్	2	194	524
సంగారెడ్డి	2	272	621
సిద్దిపేట	2	142	168
మొత్తం	6	608	1313

జిల్లాకు రెండు పరీక్షా కేంద్రాలు

మెదక్ జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసే విద్యార్థులు 194, ఇంటర్ పరీక్షకు 524 మంది ఉన్నారు. వీరు పరీక్షలు రాసేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో ఆరు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

5 నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ

సోమవారం నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతాయి. పరీక్ష సమయానికి అరగంట ముందే సెంటర్లలోకి అనుమతి ఉంటుంది. 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి ఉండదు. పరీక్షలు బార్‌కోడ్ విధానంలో నిర్వహిస్తుండటంతో అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే సెక్షన్ 15/1997 ప్రకారం జైలు శిక్ష కూడా ఉంటుంది.

పటిష్టంగా నిర్వహిస్తున్నాం

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఇందుకోసం రెగ్యులర్ పరీక్షల మాదిరిగా పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. అభ్యర్థులు బాగా చదివి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి.

– రాధాకిషన్, డీఈఓ, మెదక్